

# సిరీస్‌పై నజర్

**నేడు భారత్, దక్షిణాఫ్రికా రెండో వన్డే • సాయంత్రం 4.30 నుంచి**

పోర్ట్ ఎలిజబెత్: యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ చేజిక్కించుకునేందుకు రెడీ అయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి పోరులో ఘన విజయం సాధించిన టీమ్‌ఇండియా.. మంగళవారం మరోసారి సఫారీలతో తలపడనుంది. టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం శ్రేయస్ అయ్యర్ జట్టుకు దూరం కాగా.. అతడి స్థానంలో రజత్ పాటిదార్ జట్టులోకి రావడం లాంఛనమే! వాండరర్స్‌లో జరిగిన తొలి వన్డేలో అర్ష్‌దీప్, అవేశ్ దుమ్మురేపడంతో రాహుల్ సేన అలవోకగా విజయం సాధించగా.. ఇక్కడ కూడా అదే జోరు కొనసాగించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. అరంగేట్ర మ్యాచ్‌లో అజేయ అర్ధశతకంతో రాణించిన ఓపెనర్ సాయి సుదర్శన్‌పై అందరి దృష్టి ఉండనుంది. రుతురాజ్, రజత్ పాటిదార్, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్, సంజూ శాంసన్, అక్షర్ పటేల్‌తో జట్టు బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తున్నది. టీ20ల్లో రాణించి నయా ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకున్న రింకూ సింగ్ వన్డే అరంగేట్రం చేస్తాడా చూడాలి. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, అవేశ్, ముఖేశ్, కుల్దీప్ కీలకం కానున్నారు.

# మైదానంలో కుప్పకూలినా..

**ప్రాణాపాయం నుంచి బయటపడ్డ ఫుట్‌బాలర్**



లండన్: మనుషులు ఈ మధ్య కాలంలో హఠాత్తుగా కుప్పకూలిపోవడం సాధారణమైంది. ఏదో మాయ చేసినట్లు ఉన్న మనిషి ఉన్నట్లే శ్వాస విడుస్తున్నారు. ఇప్పుడు ఇదే కోవలో ప్రీమియర్ లీగ్‌లో ఓ ఘటన చోటు చేసుకుంది. లుటన్ టౌన్, బౌర్న్‌మౌత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో లుటన్ కెప్టెన్ టామ్ లాకిర్ ఆడుతుండగానే ఉన్నట్లు ఉండి కూలపడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన సహచరులు, వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందజేశారు. హుటాహుటిని స్ట్రెచర్‌పై లాకిర్‌ను దగ్గరలోని దవాఖాను తరలించారు. తొలుత కార్డియాక్ అరెస్ట్ భావించినా కీలక సమయంలో చికిత్స అందించడంలో లాకిర్ ప్రాణాలతో బయటపడ్డాడు. దీంతో అప్పటి వరకు తమ అభిమాన ప్లేయర్‌కు ఏం జరుగుతుందో అనుకున్న ఫ్యాన్స్ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. 'మ్యాచ్ సాగుతున్న సమయంలో టామ్ ఉన్నట్టుండి గుండెపోటుకు గురయ్యాడు. జట్టు సిబ్బంది చికిత్స అందించి దవాఖానకు తరలించారు. ప్రస్తుతం లాకిర్ కుటుంబసభ్యుల సమక్షంలో చికిత్స పొందుతున్నాడు' అని లుటన్ టౌన్ ట్వీట్ చేసింది. గతేడాది జూన్‌లో లాకిర్ గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నట్లు సన్నిహితులు పేర్కొన్నారు.



బేగంపేటలోని సెయింట్ జాన్స్ అకాడమీలో సోమవారం మల్టి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న భారత మాజీ క్రికెటర్, జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్. ఈ కార్యక్రమంలో స్టార్ షూటర్ ఇషాసింగ్, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముంబైకి నష్టమేం ఉండదు: గవాస్కర్

న్యూఢిల్లీ: ముంబై ఇండియన్స్ నయా కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. జట్టును కొత్త ఆలోచనలతో ముందుకు తీసుకెళ్తాడని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అన్నాడు. ఐపీఎల్లో అత్యంత విజయవంతమైన సారథుల్లో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడంపై సన్నీ స్పందించాడు. 'ఆ నిర్ణయం సరైందా, కాదా అనే దాని జోలికి మనం వెళ్లకూడదు. కానీ జట్టుకు ప్రయోజనం చేకూర్చడం కోసమే వారు ఈ నిర్ణయం తీసుకొని ఉంటారు. జట్టు ప్రదర్శన కూడా పడిపోయింది. నిరంతరంగా క్రికెట్ ఆడుతూ అంతర్జాతీయ క్రికెట్‌లో, ఐపీఎల్లో సారథ్య బాధ్యతలతో రోహిత్ కాస్త అలిసిపోయి ఉండవచ్చు. పాండ్యా యువ కెప్టెన్‌గా మంచి ఫలితాలు సాధించాడు' అని గవాస్కర్ అన్నాడు.

## నవీన్ ఉల్ హక్‌పై నిషేధం



దుబాయ్: అఫ్గానిస్థాన్ పేసర్ నవీన్ ఉల్ హక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఐఎల్‌టీ20లో షార్జా వారియర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా నవీన్‌ను 20 నెలల పాటు నిషేధం విధిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. టోర్నీ తొలి సీజన్‌లో షార్జాతో కాంట్రాక్టు కుదుర్చుకున్న నవీన్..రెండో సీజన్‌లో కొనసాగేందుకు మొగ్గుచూపలేదు. ఈ కారణంగా లీగ్ నిర్వాహకులను సంప్రదించడంతో నవీన్‌పై చర్యలకు ఉపక్రమించారు.

## పారా షట్లర్ల పతక జోరు

న్యూఢిల్లీ: దుబాయ్ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత పారా షట్లర్లు పతక జోరు కనబరిచారు. టోర్నీలో మహిళల డబుల్స్‌లో భారత ద్వయం మాన్సి జోషి, తులసిమతి మురుగేశన్ టైటిల్ విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో మాన్సి, తులసిమతి జోడీ 15-21, 21-14, 21-6తో ఇండోనేషియా జంట లీని ఒక్టిలా, కలిమతుస్ సాదియాపై గెలిచింది. మరోవైపు పురుషుల సింగిల్స్ తుదిపోరులో ప్రమోద్ భగత్ 17-21, 18-21తో డానియల్ చేతిలో ఓడి రజతంతో సంతృప్తి చెందాడు.

# కౌన్ బనేగా కరోడ్‌పతి

**నేడు ఐపీఎల్ మినీ వేలం • రచిన్, హెడ్, స్టార్క్‌పై అందరి కన్ను**

**అందుబాటులో ఉన్న స్లాట్‌లు 77 • పోటీపడుతున్న ఆటగాళ్లు 333**







ప్రపంచంలోనే అతి పెద్ద క్రికెట్ లీగ్ మినీ వేలానికి రంగం సిద్ధమైంది. ఐపీఎల్‌లోని పది ఫ్రాంచైజీలు 77 స్థానాల కోసం ఆటగాళ్లను ఎంపిక చేసుకోనుండగా.. 333 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇటీవల వన్డే ప్రపంచ కప్‌లో సంచలన ప్రదర్శన చేసిన రచిన్ రవీంద్ర, ట్రావిస్ హెడ్‌తో పాటు పాతకాపులు మిషెల్ స్టార్క్, కమిన్స్ కోసం కోట్లు పెట్టేందుకు ఫ్రాంచైజీలు రెడీ అయిపోయాయి. మరి ఈ సారి జాక్‌పాట్ కొట్టేదెవరో తెలియాలంటే మరికాసేపు వేచి చూడాల్సిందే!




దుబాయ్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సీజన్ 17కు ముందు మినీ వేలానికి సర్వం సిద్ధమైంది. ట్రేడింగ్‌లోనే పలువురు ఆటగాళ్లు ఫ్రాంచైజీలు మారగా.. ఇప్పుడు మిగిలిన 77 స్థానాల కోసం మంగళవారం దుబాయ్ వేదికగా వేలం నిర్వహించనున్నారు. ఈ వేలం కోసం మొత్తం 1166 మంది ఆటగాళ్లు తమ పేర్లు నమోదు చేసుకోగా.. 333 మంది పేర్లను షార్ట్‌లిస్ట్ చేశారు. అందులో 214 మంది భారతీయులు, 119 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఇందులో 116 మంది జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించినవారు కాగా.. మిగిలిన 215 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు ఉన్నారు. అసోసియేట్ దేశాలకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు వేలంలో పాలుపంచుకుంటున్నారు. మొత్తం 77 స్లాట్‌లలో 30 విదేశీ ప్లేయర్లతో భర్తీ చేయనున్నారు. విదేశాల్లో ఐపీఎల్ వేలం జరగనుండటం ఇదే తొలిసారి కాగా.. ఇటీవల మహిళల ఐపీఎల్ నిర్వహించిన మల్లికా సాగర్ వేలాన్ని నిర్వహించనుంది.

### 77 స్థానాలు.. 262 కోట్లు

మొత్తం 10 జట్లు ఈ వేలంలో పాల్గొననుండగా.. ఫ్రాంచైజీల వద్ద రూ.262.95 కోట్లు ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్ వద్ద అత్యధికంగా రూ.38.15 కోట్లు, అత్యల్పంగా లక్నో సూపర్ జెయింట్స్ వద్ద రూ.13.15 కోట్లు అందుబాటులో ఉన్నాయి. రూ. 34 కోట్లు ప్యాకెట్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎవరిని ఎంపిక చేసుకుంటుందనేది ఆసక్తికరం. వన్డే వరల్డ్‌కప్‌లో దుమ్మురేపిన రచిన్ రవీంద్ర, ట్రావిస్ హెడ్, మధుషనక, స్టార్క్, కమిన్స్‌పై కనక వర్షం కురవడం ఖాయమే. ట్రేడింగ్‌లో హార్దిక్ పాండ్యాను దక్కించుకున్న ముంబై ఇండియన్స్ రూ.17.75 కోట్లు వేలంలో ఖర్చు పెట్టనుంది. రూ.32.7 కోట్లు అందుబాటులో ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ అత్యధికంగా 12 మంది ప్లేయర్లను కొనుగోలు చేసుకునే చాన్స్ ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఆరు స్లాట్‌లు ఖాళీగా ఉండగా.. అందులో ముగ్గురు విదేశీ ప్లేయర్లను ఎంపిక చేసుకోనుంది.

### ఉమేశ్, శార్దూల్, హర్షల్‌కు గిరాకీ

23 మంది ఆటగాళ్లకు కనీస ధర రూ. 2 కోట్లతో వేలంలోకి రానున్నారు. అందులో స్టార్క్, హెడ్‌తో పాటు ఉమేశ్ యాదవ్, శార్దూల్ ఠాకూర్ కూడా ఉన్నారు. మరో 13 మంది ప్లేయర్లు తమ కనీస ధర రూ.1.5 కోట్లుగా నిర్ణయించుకున్నారు. ఇంగ్లండ్ ప్లేయర్లు స్టోక్స్, రూట్, ఆర్చర్‌తో పాటు షకీబ్, లిటన్, కేదర్ జాదవ్ ఈ వేలంలో అందుబాటులో లేరు. ఎనిమిదేండ్ల తర్వాత ఐపీఎల్లో పునరాగమనం చేస్తున్న స్టార్క్ కోసం కోట్లు కుమ్మరించేందుకు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉన్నాయి. అండర్-19 స్థాయిలో రాణిస్తున్న ఆల్‌రౌండర్ అర్షిన్ కులకర్ణి పంట పండే అవకాశం లేకపోలేదు. అన్నీ జట్లు దేశవాళీ పేసర్లపై భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉండటంతో.. ఉమేశ్, శార్దూల్, హర్షల్‌కు గిరాకీ బాగా కనిపిస్తున్నది.

#### తెలుగు ఆటగాళ్లకు చాన్స్ దక్కేనా

హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ.. ముంబై ఇండియన్స్ జట్టులో కీలక ఆటగాడిగా మారిపోగా.. ఈ సారి వేలంలో.. తెలుగు ఆటగాళ్లు హనుమ విహారి, కేఎస్ భరత్‌తో పాటు.. ఇటీవల అండర్-19 ప్రపంచకప్ జట్టుకు ఎంపికైన మురుగన్ అభిషేక్, అవినాశ్‌రావుపై ఎవరు ఆసక్తి కనబరుస్తారో చూడాలి. సుదీర్ఘ కాలంగా ఐపీఎల్ ఆడుతున్న అంబటి రాయుడు గత సీజన్‌తో రిటైర్మెంట్ ప్రకటించగా.. అతడి స్థానాన్ని చెన్నై సూపర్ కింగ్స్ మనీశ్ పాండేతో భర్తీ చేసే చాన్స్ ఉంది.






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.